# ఏడుమడెబ్బ

-టి.పి.హేమమాలిని

రాష్ట్ర అసెంబ్లీని రద్దుచేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది అధిష్టానవర్గం. గవర్నర్ ఆమోదముద్ర పడింది. అంతే! రాష్ట్రంలోని అన్ని పార్టీలూ ఎన్నికల ఎజెండాలను, పార్టీ జెండాలను రూపొందించే ప్రయత్నంలో పడ్డాయి.

ఈ వార్త వినగానే ఏడుకొండలుకి తిరుమల సప్తగిరులూ ఎక్కడా ఆగకుండా ఎక్కిన ఫీలింగ్ కలిగింది. గుంటూరు మిరపకాయ బజ్జీలు ఓ పాతిక తిన్న అనుభూతికి లోనయ్యాడు. అయితే అతనికి ఆనందంగానే వుంది. చాలారోజులుగా అతను ఎన్నికల కోసమే ఎదురుచూస్తున్నాడు. ఎందుకంటే అతనికి చిరకాల వాంఛ...అసెంబ్లీకి పోటీచేసి గెలిచి సినిమా టైటిల్‌లా ఎమ్ఎల్ఏ ఏడుకొండలు అనిపించుకోవాలని.

ఇప్పుడు ఆ తరుణం వచ్చిందని సంబరపడ్డాడు.

అయితే గెలిచేందుకు ఏ ప్రయత్నాలు చేయాలో అర్థంకాక పై ఫీలింగ్స్ కలిగాయి. ఏడుకొండలకి స్థానికంగా పలుకుబడి బాగానే వుంది. గతంలో అతను గ్రామ పర్పంచ్‌గా పదవి వెలగబెట్టాడు.

రాజకీయాల్లో ఆసక్తితోపాటు ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు డబ్బు కూడా బాగానే వుంది.

అందుకే గ్రామ ప్రజలను ఏలిన అనుభవాన్ని రాష్ట్రమంతా పంచాలనుకున్నాడు. వెంటనే రాజధానికి పయనమయ్యాడు. అధికార పార్టీ నాయకుడిని కలిసాడు వందిమాగధులు తోడురాగా.

ఎన్నో తర్జనభర్జనల అనంతరం తన గెలుపు ఖాయమని అధిష్టాన్ని ఒప్పించాడు. ఎట్టకేలకు అతను ఉంటున్న నియోజకవర్గం తాలూకు టిక్కెట్ ఇవ్వడానికి అంగీకరించారు.

పార్టీ చందంగా లక్షల సూట్‌కేసు చేతులు మారింది. టిక్కెట్ వచ్చినందుకే గెలిచినంతగా చంకలు గుద్దుకున్నాడు.

తిరిగి రాగానే ప్రచార సన్నాహాలు ప్రారంభించాడు.

ఊరూరా తిరిగాడు. టాప్‌లెస్ జీప్‌లోంచి చెయ్యూపుతూ ప్రసంగించాడు. అమెరికా అణ్వస్త్ర విధానం గురించీ, రష్యా రాజకీయాల గురించీ అనర్గళంగా ఉపన్యాసాలు దంచాడు. తను గెలిస్తే ఖచ్చితంగా విదేశీ పద్ధతులలోనే సేవ చేస్తానన్నాడు.

తండోపతండాలుగా జనాలు రాసాగారు. ఆ జనవాహిని తన వాక్చాతుర్య ఫలితమేనని మురిసిపోయాడు.

కానీ ఆ మురిపెం ముణ్నాళ్ల ముచ్చటే అయింది.

తన సభలకే కాకుండా ఇతర అభ్యర్థుల ప్రసంగాలను కూడా అంతే ఆసక్తితో వింటున్నారని గ్రహించాడు.

ఒక్కక్షణం అతనికి అర్థం కాలేదు ప్రజాభిప్రాయం ఏ పక్షాన వుందో! జనాన్ని తను ఆకర్షించాలనుకుంటే ఏం చేయాలో పాలుపోలేదు. ఆడవాళ్లకు వెండి కుంకుమ భరిణెలు, మగవాళ్లకి వెండి పొడుంకాయలు పంచాడు. ఇంటికో స్టీలుబిందె అమలు చేసాడు.

ఓటుకోనోటు పథకాన్ని ప్రారంభించాడు. ఇక మధుపానప్రియులకి పండుగే. ఎవరెంత తాగితే అంత పోసేలా వైన్‌షాపులతో ఒప్పందం చేసుకున్నాడు.

తనకు తెలిసినవన్నీ అమలు చేసినా రావలసినంత గుర్తింపు రాలేదని గమనించాడు.

జనం తన దగ్గర ఎలా బహుమానాలు అందుకుని ఓటేస్తామని వాగ్దానం చేసారో ఇతరులవద్ద కూడా కానుకలు స్వీకరించి స్వస్తిక్ గుర్తును వారికే దానం చేస్తామని చెప్పడం చూసిన ఏడుకొండలు నీరుగారిపోయాడు.

ఇదే సంగతిని తన పిఎ జోగినాథంతో చర్చించాడు.

"ఏంటయ్యా జోగీ! మనం జనాన్ని ఆకట్టుకునేందుకు ఏం చేయాలంటావు?" లంక పొగాకు చుట్ట గుప్పుమనిపిస్తూ అడిగాడు.

"ఏమైనా చేసి తీరాలండీ" బదులిచ్చాడు.

"చాలా చేసాం కదా"

"అవన్నీ పాతబడిపోయాయండీ. కొత్తవి కావాలి"

"ఉచిత విద్యుత్ వరాన్నిద్దామా?"

"ఒక్క ఓటు కూడా రాలదు"

"కల్తీలేని పురుగుమందులు సప్లయ్ చేద్దాం"

"లేదు సార్. ప్రజలు కూల్‌డ్రింక్‌లు బాగా వాడుతున్నారు"

"మరెలాగయ్యా...నువ్వు ఉండి ఏం ప్రయోజనం లేదు. నువ్వెళ్ళు నా తిప్పలేవో నేను పడతాను" విసుక్కున్నాడు ఏడుకొండలు.

వార్తలొచ్చే సమయం కావడంతో టీవీ ఆన్ చేసాడు.

యధాలాపంగా వింటున్న వార్తల మధ్య ఒక ప్రత్యేక వార్త అతన్ని ఆకర్షించింది.

చకచకా అతని బుర్రలో ఒక ఆలోచన రూపుదిద్దుకుంది.

***

"ఏంటి సార్ చాలా హుషారుగా ఉన్నారు" అడిగాడు జోగినాథం.

"మంచి ఆలోచన పుట్టిందయ్యా బుర్రలో"

"ఏంటి సార్ అది"

"ఇంటికో సెంటు"

"అబ్బే లాభం లేదండీ. సెంటు బాటిల్ అయిపోగానే జనం మిమ్మల్ని మరచిపోతారు" పెదవి విరిచాడు పి.ఎ.

"నీ మొహం తగలెయ్య. సెంటంటే రాసుకునేది కాదయ్యా. సెంటు భూమి అన్నమాట" వివరించాడు ఏడుకొండలు.

"నాకర్థం కాలేదయ్యా"

"అదేనయ్యా మనకు పనికిరాని భూములున్నాయికదా. వాటిల్లోంచి ఇంటికో సెంటు భూమి ఇస్తామని చెప్పాలి"

"మరి మీ స్థిరాస్తులు తరిగిపోతాయి కదండీ"

"నాకు ఎమ్ఎల్ఏ పదవి రావాలిగానీ సంపాదించడం ఎంతసేపు?" ధీమాగా పలికాడు ఏడుకొండలు.

"జనం నమ్ముతారా అని అనుమానంగా ఉంది" జోగినాధంలో సందేహం.

"నమ్మించాలయ్యా. మన పనే అది కదా!"

★★★


వీధివీధికీ వాడవాడలా తన ప్రచార అస్త్రాన్ని సంధించాడు.

మురికివాడల్లోనూ సంచరించాడు.

అయితే ప్రజలు అంత తొందరగా నమ్మలేదు. గెలిస్తే ఇక మొహం చూపిస్తారన్న ఆశ లేదని వక్కాణించారు.

మాట తప్పనని మాటిచ్చాడు ఏడుకొండలు. అయినా రాతకోతలు లేనిదే నమ్మమన్నారు జనాలు.

నిజానికి ఏడుకొండలేమీ కర్ణుడికి కజిన్ బ్రదరేమీ కాదు ఊరికే దానాలు చేసేందుకు.




ఓట్లు పడాలిగానీ సెంట్లు పోకూడదని భావించాడు. ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుకోవాలని చూసాడు. గెలిచాక ప్రజలకు చెయ్యిద్దామనుకున్నాడు.

కానీ పరిస్థితి ఆశించినట్లుగా లేదు. జనాలు నమ్మి ముద్రలు గుద్దాలి. వారికెలా నమ్మకం కలిగించడం?

అది కూడా తనకు నష్టం లేకుండా. ఆలోచిస్తూనే టీవీ ఆన్ చేసాడు. వార్తలు మొదలయ్యాయి.

యధాలాపంగా వింటున్న అతన్ని ఒక ప్రత్యేక వార్త ఆకట్టుకుంది.

ఖాళీగా వున్న అతని మస్తిష్కంలో అద్భుతమైన వ్యూహం రూపుదిద్దుకుంది. దోమతెరలోని మశకంలా గింగిర్లు తిరగసాగింది.

బ్రహ్మాండమైన ఐడియా. దాంతో కర్ర విరగకుండా, పాము చావకుండా పని సులభమవుతుంది.

★★★

'ఇంటికో సెంటు'కి రంగం సిద్ధమైంది. కొన్ని వేల సెంట్ల భూమి నియోజకవర్గ ఓటర్ల పరం చేస్తూ స్టాంపు పత్రాలు సిద్ధమయ్యాయి.

ప్రతి ఇంటి తలుపుతట్టి స్టాంపు పత్రం వారిచేతిలో పెట్టి ఓటును అభ్యర్థిం చాడు.

ఏడుకొండలు మనసులో ఒకటే ధీమా. తను గెలిచి పదవిలో ప్రవేశించాలే గానీ ఇంతకు పదిరెట్లు సంపాదించలేడా అని!

***

ప్రచారపర్వం ముగిసింది. ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం వచ్చింది.


అసూహ్యారీతిలో ఎక్కువశాతం ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల ముందు ప్రజల నిర్లిప్తత చూసిన నాయకులు ఆనందంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

ఓట్ల లెక్కింపు మొదలైంది. ఊహించినట్లుగానే అధికార పార్టీయే ఆధిక్యంలో వుంది.



## అందాలవిందు

తారల డ్రెస్‌లు కుర్రకారు గుండెల్ని పిండేస్తాయి. అందంతో అలరించే సీన్స్ కోసం యువతరం థియేటర్ల చుట్టూ తెగ తిరుగుతుంది. ఇప్పుడు మల్లికా షెరావత్ జనాన్ని అలరించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నట్టుంది. డేవిడ్ ధావన్ కొత్త చిత్రంలో ఆమె సెక్సీ లేడీగా నటిస్తోంది. సంజయ్‌దత్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం ఆమె ఇమేజ్‌కి తగ్గట్టుగానే ఉంటుందంటున్నాడు దర్శకుడు. ఈమె పోషిస్తున్న పాత్ర ఏమిటో ఇంకా నిర్ధారణ కాలేదు. అందాల విందు కోసం మీరు రెడీయేనా?




చాలాచోట్ల స్వతంత్ర అభ్యర్థులు కూడా గెలిచే సూచనలు కనిపిస్తున్నాయి.

మరి ఏడుకొండలు నియోజకవర్గంలో పరిస్థితి?

ఆధిక్యత తనదేనన్న ధీమాతో విదేశీ సరుకుతో గొంతు తడుపుకుంటున్న ఏడుకొండలుకి తన ప్రత్యర్థి తనకన్నా ఆధిక్యతలో వున్నాడన్న వార్త వినగానే ఎక్కిన కిక్కంతా దిగిపోయింది. సమయం గడుస్తున్నకొద్దీ ఉత్కంఠ పెరగసాగింది.

ఎట్టకేలకు ఫలితాలు విడుదలయ్యాయి. ఏడుకొండలు ఆశల్ని భగ్నం చేస్తూ అతడి ప్రత్యర్థి ఇండిపెండెంట్ విజయం సాధించాడు. అశనిపాతం లాంటి ఈ వార్తతో మొదలు నరికిన చెట్టులా కుప్పకూలిపోయాడు ఏడుకొండలు.

***

భారీగా తగిలిన ఎదురుదెబ్బ తాలూకు నిరాశ నుండి మెల్లగా తేరుకున్నాడు ఏడుకొండలు.

అతడికి అర్థం కానిది ఒక్కటే. తను ఎన్ని కానుకలిచ్చినా, హామీలిచ్చినా, వాగ్దానాలు చేసినా ప్రజలు ఎందుకు నమ్మలేదు? కొంపదీసి అమాయకులు అసాధ్యులైపోయారా?

ఆలోచనల మధ్య అతలాకుతలం అయ్యే తరుణంలో సందర్భోచితంగా ప్రవేశించాడు జోగినాథం.

"ఏమయ్యా జోగీ! నువ్వు కూడా మొహం చాటేసావన్నమాట. పార్టీ ఫిరాయించావా?" అక్కసుగా అడిగాడు ఏడుకొండలు.

"తప్పదుకదా సార్! ఏ ఎండకా గొడుగు!" ధూర్త లక్షణాన్ని ప్రదర్శించాడు జోగినాథం.

"నక్క వినయాలు ఆపు. ముందీ సంగతి చెప్పు. నేను ఎన్నికల్లో ఎలా ఓడిపోయాననంటావు. గెలుపు భాయమనేకదా చాలా డబ్బు ఖర్చు చేసాను. ఎవరూ చేయని, చేయలేని పనులు చేసానుకదా" తన అనుమానం జోగినాథం ముందు వ్యక్తపరిచాడు ఏడుకొండలు.

అతని బాధని అర్థం చేసుకున్న జోగినాథం తనకు తెలిసిన అసలు సంగతిని బయటపెట్టాడు.

"ప్రజలు మీరనుకున్నంత వెర్రివాళ్ళు, అమాయకులు కాదు సార్. తరతరాలుగా ఒకే వంశాన్ని గెలిపిస్తూ వచ్చే పాతకాలం ఓటర్లు కారు వీళ్ళు. అలాగే ఏది మంచో ఏది చెడో తేల్చుకోగల యుక్తాయుక్త విచక్షణాపరులయ్యారు. తమకున్న అతి పవిత్రమైన ఓటు హక్కును వారు సక్రమంగానే వినియోగించుకున్నారు. అందుకే ఓ సంఘ సేవకుడిని తమ ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. అతనివలన ఒకసారి కాకపోతే ఒకసారైనా మంచి జరగవచ్చనే ఏకాభిప్రాయం వారందరిదీ. ఇకపోతే మీ ఓటమి గురించి చెప్పాలంటే మీరు ఇంటికో సెంటు ప్రదానం చేస్తూ రాసిచ్చిన స్టాంపు పత్రాలు నకిలీవని ప్రజలు గ్రహించారు. మురికివాడల్లో సైతం ప్రవేశించిన మీడియా ఫలితమే ఇది. అప్పనంగా మీరు ఎండుకి పని చేసారన్న ప్రశ్న వారి మెదళ్లను ప్రభావితం చేసింది. సంబంధిత న్యాయాధికారిని కలుసుకోగా మీరిచ్చినవి అసలు దస్తావేజులు కావని తెలిసింది. మీ యుక్తిని ఆకళింపు చేసుకున్న ప్రజలు సమయం కోసం వేచి చూసి తమ సత్తా చూపారు. నకిలీస్టాంపు పేపర్లతో మీరు ప్రజలను మోసం చేయాలనుకున్నారు. కానీ వివేకవంతులైన ఓటర్లు అసలు వ్యక్తిని ఎంపిక చేసుకుని మీరే నకిలీ అని తేల్చారు. తాడిని మీరు తంతే మీ తలదన్నే వాడుంటాడు సార్. మరచిపోకండి. తప్పొప్పులెవరివో తరచి చూసుకోండి. వస్తా మరి. మా కొత్త ఎమ్మెల్యేగారు ఎదురు చూస్తుంటారు" అంటూ బయటకి నడిచాడు జోగినాథం.

★